ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
శనివారం 22 జూన్ 2024

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం 6లో..
అభివృద్ధిలో మెట్‌పల్లి ముందంజలో ఉంది 6లో..

గొర్రెల పథకానికి మంగళం



వాటా ధనం రైతులు ఖాతాల్లో వెనక్కి...

జిల్లాలో రెండో విడత కోసం లబ్ధిదారులు తమ వాటా కింద 25శాతం నగదును డీడీల రూపంలో చెల్లించారు. ప్రస్తుతం దరఖాస్తు దారులకు వాటా ధనాన్ని తిరిగి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో సుమారు గత నెల రోజులగా పశుసంవర్ధక శాఖ అ ధికారులు వాటా ధనాన్ని దరఖాస్తు దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 274 మంది ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ. 43,750 చొప్పున వాటా ధనాన్ని జమ చేశారు. ఇంకా సుమారు 300 మంది దరఖాస్తుదారులు వాటా ధనం వాపసు ఇవ్వాలని అధికారులకు వినతి చేశారు. వీరి ఖాతాల్లో డబ్బులను జమ చేసే పనులను అధికారులు నిర్వహిస్తున్నారు. మిగిలిన దరఖాస్తు దారుల వినతులు సమర్పిస్తే వాటా ధనాన్ని వాపసు చేస్తామని అధికారులు అంటున్నారు. సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మంగళం పాడి వాటా ధనాన్ని వాపసు చేస్తుండడం సమంజసం కాదని, పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని పలువురు గొల్ల కురమలు కోరుతున్నారు.

- రెండో విడత పంపిణీ లేనట్టే..?
- లబ్ధిదారులు చెల్లిచిన వాటా ధనం తిరిగి వారి ఖాతాల్లోకి
- ఒక్కో యూనిట్‌కు చెల్లించిన మొత్తం రూ. 43,750
- పథకం అమలు చేయాలంటున్న గొల్ల కురమలు

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): గొల్ల కురుమల కుటుంబాలకు ఆర్థికభరోసా కల్పించాలనే ఉద్ధేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం నిలిచిపోయింది. గతంలో రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులు కొంత కాలంగా పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పలు జిల్లాల్లో మొదటి విడతలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు చెల్లించిన వాటా ధనం వెనక్కి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సుమారు నెల రోజులుగా డీడీలు కట్టిన వారి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు పాతిక శాతం వరకు వాటా ధనం వెనక్కి ఇచ్చారు. మరో 1000 మంది లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో గొల్ల కురుమ కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టి లో ఉంచుకొని ఇతర పథకాల తరహాలోనే గొర్రెల పంపిణీని కొనసాగిం చాలని గొల్లకురుమలు కోరుతున్నారు.

మొదటి విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ ఇలా...

గొల్ల, కురుమలను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మొదటి విడతగా సబ్సిడీ గొర్రెల పంపిణీ చేసింది. 20 గొర్రెలు, ఒక పొటేలుతో కూడిన యూనిట్‌కు రూ. 1.25 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. ఇందులో లబ్ధిదారుడు తన వాటాకింద రూ. 31,250 చెల్లిస్తే ప్రభుత్వం రూ. 93,750 చొప్పున సబ్సిడీ ఇస్తోంది. జిల్లాలో 21,067 మంది లబ్ధిదారులకు గొర్రెలను అందించడానికి ఎంపిక చేశారు. ఇందులో లిస్ట్ ఏ కింద 9,756 మందికి, లిస్ట్ బీ కింద 7,719 మందికి ఇప్పటికే యూనిట్లు పంపిణీ చేశారు. జిల్లా లో ఇంకా 3,592 మందికి గొర్రెల యూనిట్లు అందించాల్సి ఉంది. మొదటి విడతలో లిస్ట్ 'ఏ', లిస్ట్ 'బి'గా పంపిణీ చేయాలని నిర్ణయించిన అధికారులు మొదటి విడత లిస్ట్ 'ఏ' కింద 2017-18 సంవత్సరంలోనే దా దాపు లక్ష్యం మేరకు యూనిట్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా లో లిస్ట్ 'ఏ'లో 9,756 యూనిట్ల పంపిణీ జరిపారు. జిల్లాలో లిస్ట్ 'ఏ' కింద అత్యధికంగా వెల్గటూరు మండలంలో 952 యూనిట్లు పంపిణీ చేయగా, అత్యల్పంగా జగిత్యాల మండలంలో 76 యూనిట్లు పంపిణీ చేశారు.

మొదటి విడత లిస్ట్ 'బి' పంపిణీ ఇలా..

జిల్లాలో మొదటి విడత లిస్ట్ 'బి' కింద సబ్సిడీ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని 2021 జనవరి 21వ తేదీన మంత్రి తలసాని యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లాలో మొదటి విడత లిస్ట్ 'బి'లో ఇప్పటి వరకు 7,719 యూనిట్ల పంపిణీ చేశారు. జిల్లాలో లిస్ట్ 'బి' కింద అత్యధికంగా వెల్గటూరు మండలంలో 872 యూనిట్లు పంపిణీ చేయగా, అత్యల్పంగా జగిత్యాల మండలంలో 79 యూనిట్లు పంపిణీ చేశారు. జిల్లాలో మిగిలిన 1,250 యూనిట్ల పంపిణీ చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో నిలి చిపోయింది. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, కరో నా వ్యాప్తి, ఎన్నికలు, పలు జిల్లాల్లో పథకం అమలులో చోటుచేసు కున్న అవకతవకలు, రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు తదితర కారణాల వల్ల పంపి ణీలో జాప్యం చోటుచేసుకోంది. దీంతో సంబంధిత లబ్ధిదారులు ఎదురు చూపులతో గడుపుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే...

కోటిచింతల వేణు గోపాల్ రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

జిల్లాలో ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం దరఖాస్తు దారులకు వాటా ధనాన్ని తిరిగి వారి వారి ఖాతాల్లో జమ చేస్తున్నాము. వాటా ధనం వాపసు కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారికి ఖాతాల్లో జమ చేస్తున్నాము. ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

పాఠశాలల పనులను నాణ్యతతో పూర్తిచేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, జూన్ 21: అమ్మ ఆదర్శ పాఠశాల పాఠశాలలో జరుగుతున్న పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోగల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, పురాణిపేట ప్రభుత్వ పాఠశాల, హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాల, జాబితాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్, పెర్కపల్లిలోని ఎంపీఎస్ఎస్ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించిన ఆయన పుస్తకాలు, నోట్‌బుక్‌లు యూనిఫాంలు పంపిణీ చేశారా లేదా అనే వివరాలతో పాటు విద్యార్థుల అటెండెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వందశాతం ప్రగతి సాధించేలా విద్యా బోధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డీఈవో డాక్టర్ జగన్మోహన్ రెడ్డి తదితరులున్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ అంగన్ వాడీల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అంగన్ వాడీ టీచర్లకు జాతీయ నూతనం విద్యా విధానం అనుసరించి తయారు చేసిన మూల్యాకంన పుస్తకాలను అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. అవగాహన సమావేశానికి వచ్చిన అదనపు కలెక్టర్ రాంబాబుకు పూలమొక్కను అందించి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఆటా పాటలతో బోధన జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని వాణి శ్రీ, కలెక్టర్ కార్యాలయ ఏవో హన్మంతరావు, సీడీపీవోలు వీర లక్ష్మీ, నరసింగ రాణి, తిరుమల దేవీ, జిల్లా కో ఆర్డినేటర్ మధు కుమార్, పలువురు సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ధర్మపురి ఆలయ ఈవో



కలెక్టర్‌కు ధర్మపురి ఆలయ ప్రసాదం అందిస్తున్న ఈవో

ధర్మపురి, జూన్ 21: జగిత్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను శుక్రవారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి దైవ దర్శనానికి రావాలని కోరుతూ ఆహ్వానిం చారు. జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సత్యప్రసాద్‌ను ఉదయం ఈవో శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి స్వామి శేష వస్త్రం కప్పి సత్కరించి, ప్రసాదాలు అందించారు. దీంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నరసింహుని దర్శనానికి వస్తానని చెప్పినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్ కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిశారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కలెక్టర్ సైతం ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో ఒకరి నొకరు అభినందనలు తెలుపుకున్నారు.

జగిత్యాల: ఇటీవల జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ సత్య ప్రసాద్‌ను శుక్రవారం జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలువురు మున్సిపల్ ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జడ్పీ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, జూన్ 21 : జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత శుక్రవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుని పిల్లలను మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా కాపాడాలని కోరారు.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ



ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవీ ఆత్మహత్యకు పాల్పడడంతో శోకసంద్రంలో మునిగిన ఆయనను హైద్రాబాద్‌లోని నివాసంలో ఓదార్చారు.

సాఫ్ట్‌బాల్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అర్బన్, జూన్ 21: మేలో నిర్వహించిన అంతర్జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలలో శ్రీచైతన్య సీబీ ఎస్ఇ జాబితాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఇండియా తరుపున తమ పాఠశాల నుంచి సుమిత్, హర్షవర్ధన్, హరికృష్ణ పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. కరస్పాండెంట్ గంగారెడ్డి,డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా
- ప్రతి ఫిర్యాదు పట్ల స్పందిస్తాం
- ఎస్పీ అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 21 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కారం చేయడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించడమే మా ప్రధాన లక్ష్యమన్నారు. సామాన్యుడిని దృష్టిలో ఉంచుకుని వారికి భరోసా కల్పించే విధంగా పోలీసింగ్ ఉంటుందన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, పోకిరీల ఆగడాలకు అడుకట్ట వేసేలా షీ టీం పని చేస్తుందని వివరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై పోలీస్ స్టేషన్ల వారిగా నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని ఒకటి కంటే ఎక్కువ నేరాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణాపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని, యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాలను అనుసరిస్తూ ప్రజలను ఆర్థికంగా మోసాలకు గురి చేస్తున్నారని అప్రమత్తత తప్పనిసరన్నారు. అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తదితరలు ఉన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా కలువచ్చు

పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తమకు ఎలాంటి సమస్య వచ్చినా ఎప్పుడైనా సరే నేరుగా కలువవచ్చునని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించే వివిధ పోలీస్ విభాగాలను పరిశీలించారు. డీసీఆర్‌బీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాలను సందర్శించి పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయమని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం రెండు నిమి షాలు మౌనం పాటించి నివాళులు అర్పిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జీవితాంతం తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం ప్రొఫెసర్ జయ శంకర్ పనిచేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో రఘువరన్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జయ శంకర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

మల్యాల, జూన్ 21: మతిస్థిమితం సరిగలేని ఓ యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ కొండగట్టు రాగ ఈ నెల 10 నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఎస్సై-2 కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం కామారంకు చెందిన నర్మెట రంజిత్ (25)అనే యువకుడికి మతిస్థిమితం సరిగలేక అనారోగ్యంకు గురి కాగ నెల రోజుల క్రితం కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి వచ్చారు. పది రోజల క్రితం బహిర్భూమికి అని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం రంజిత్ తల్లి కవిత పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, ఇతరాత్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు

నేటి నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

జగిత్యాల అర్బన్, జూన్ 21: ఈ నెల 22, 23, 24 తేదీలలో పాలిసెట్ 2024 సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని పాలిసెట్ జిల్లా కన్వీనర్ అరిగెల అశోక్ తెలి పారు. పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులంతా తమ సర్టిఫికేట్స్‌ను వారికి కేటాయించిన స్లాట్ టైంకి అరగంట ముందు కళాశాలకు చేరుకోవాలని, ప్రతి అరగంటకు ఒక స్లాట్ ఉంటుందని ఆసమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. విద్యార్థులు తమ వెంట అన్ని విద్యా, ఇతర ధ్రువపత్రాలతో పాటు, పరీక్ష హాల్ టికెట్, ర్యాంకు కార్డు ఒరిజినల్స్‌తో పాటు ఒక జత జిరాక్సు కాపీని వెంట తెచ్చుకోవాలని జిల్లా పాలిసెట్ సిస్టం అడ్మినిస్ట్రేటర్ ఎలిజబెత్‌రాణి తెలిపారు.

జగిత్యాల డీపీఆర్‌వో బీమ్ కుమార్‌పై బదిలీ వేటు

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల డీపీఆర్‌వోగా పనిచేస్తున్న భీమ్ కుమార్‌పై శుక్రవారం ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. కరీంనగర్‌లో సమాచార శాఖ ఏడీగా పనిచేస్తున్న లక్ష్మణ్ కుమార్‌కు జగిత్యాల డీపీఆర్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో సాంస్కృతిక సారథికి చెందిన మల్లిక్ తేజా అను కళాకారుని నిర్లక్ష్యపు వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు ఇటీవల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశాడు. రాష్ట్ర గీతమైన జయజయహే తెలంగాణపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కళాకారుడు మల్లిక్ తేజా వ్యాఖ్యలు చేశారన్న పిర్యాదుపై విచారణ జరపడం, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చోటుచేసుకుందన్న విమర్శలు ఇటీవల వచ్చాయి.

డీపీఆర్‌వో భీమ్ కుమార్‌ను బదిలీ చేస్తూ హైద్రాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హన్మంత్ రావు ఉత్తర్వులను జారీ చేశారు.

గుడుంబా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ

జగిత్యాల టౌన్, జూన్ 21 : జగిత్యాలను గుడుంబ రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడుంబా తయారీ, విక్రయ దారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లి నాటు సారా తయారీ కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల, ధర్మపురి, డీటీ ఎఫ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు సర్వేశ్వర్‌రావు, మహేందర్ సింగ్, రాజమౌళి, జగిత్యాల టౌన్, రూరల్, మల్యాల, ధర్మపురి సీఐలు వేణుగోపాల్, ఆరీఫ్‌అలీ ఖాన్, రవి, రాంన ర్సింహారెడ్డి ఉన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

మల్యాల, జూన్ 21: మండలంలోని కొండగట్టు వద్ద పక్కపక్కనే గల రెండు వైన్స్‌లలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ పైకప్పు రేకుల తొలగించి లోపలికి వెళ్లిన దొంగలు కౌంటర్లలో గల రూ.35వేల నగదు ఎత్తుకెళ్లిన్నట్లు నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

దైనందిన జీవనంలో యోగా భాగం కావాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి

జగిత్యాల అర్బన్, జూన్ 21: ప్రతి ఒక్కరి దైనందిక జీవితంలో యోగా భాగం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక గీతా విద్యాలయంలో యోగా డే సెలబ్రేషన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు యోగా అవసరం అన్నారు. యోగాకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని 2015 జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి యేటా నిర్వహిస్తామన్నారు. ప్రపంచ దేశాల్లో సైతం యోగాకు ప్రాతినిధ్యం పెరగడం గమనించాలన్నారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుందని, యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రజల్లో పెరిగిన అవగాహనతో యోగాకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ బాధ్యులు కృష్ణహరి, కొక్కు గంగాధర్, జుంబర్తి దివాకర్, సిరికొండరాజన్న, నాయకులు దూర్శెటి మమత, పవన్‌సింగ్, రాజేందర్, అశోక్, రాజ్‌కుమార్, రాజ్ గోపాల్, గడ్డల లక్ష్మీ, సింగం పద్మ, మామిడాల కవిత పాల్గొన్నారు.

- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భవానీ నగర్‌లో గల అద్వైత శ్రీచక్ర పీఠం, శ్రీశ్రీ పాద లక్ష్మీనర్సింహా శాస్త్రి ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు.
- ఆచార్య జయశంకర్ వ్యవసాయ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు కేఎల్‌వీ క్రిష్ణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేయగా, గురూజీ యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



యోగా చేస్తున్న శ్రావణి తదితరులు

జగిత్యాల టౌన్ : వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మిని స్టేడియంలో, భవాని నగర్‌లో యోగా గురువు లక్ష్మీనృసింహ శాస్త్రి ఆధ్వర్యంలో, జగిత్యాల స్పెషల్ సబ్ జైలులో యోగా మాస్టర్ ఎన్నం రాంరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, జైలర్ మొగిలేష్ ఉన్నారు. అలాగే ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వీరుపాక్షి గార్డెన్‌లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులు యోగా డే వేడుకల్లో పాల్గొని ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీంద్ర కుమార్, రఘు చందర్, రంగారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన జలెందర్(33) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి జలెందర్ బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జలెందర్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లి రెండు నెలల క్రితం వచ్చాడు. సోమవారం తిరిగి దుబాయి వెళ్లేందుకు విమాన టికెట్టు సైతం బుక్ చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంథని, జూన్ 21: స్థానిక పోచమ్మవాడలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుద్దార్తి వర్షిత్(18) యువకుడు శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. తన ఇంటి ముందు నిర్మించిన మరో ఇంటిలో విద్యుత్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. వర్షిత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తండ్రి బుద్దార్తి నవీన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎఫ్‌సీఐ బియ్యం బస్తాలు దొంగిలించిన ముఠా అరెస్టు

అంతర్గాం, జూన్ 21: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఎఫ్‌సీఐ బియ్యం బస్తాల గూడ్స్ రైలు నుంచి 30క్వింటాళ్ల బియ్యం బస్తాలు దొంగిలించి రెండు ఆటోలలో తరలిస్తున్న నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్టు రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. నిందితులు గుమ్ముల భీమయ్య, జనగామ దినేష్, కనుసోతు వెంకటేష్, అన్నెల వంశీలను మంచిర్యాల పట్టణంలో పట్టుకుని వీరితో పాటు రెండు ఆటోలు టీఎస్01యూబీ7552, టీఎస్19టీఏ6109లను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి, డీ ఐలయ్య, సుమన్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో వ్యక్తి ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

జ్యోతినగర్, జూన్ 21: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో శుక్రవారం కందుల రమేశ్(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి దూలానికి తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా రమేష్ ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

యూనిసెఫ్ ప్రతినిధుల సందర్శన



తిమ్మాపూర్‌లో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధులు

తిమ్మాపూర్, జూన్ 21: తిమ్మాపూర్ గ్రామాన్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రా ᐟ రాష్ట్రాల యూనిసెఫ్ ప్రతినిధులు(40మంది) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బృదం సభ్యులు పర్యటించి పారిశుధ్యం, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్త సేకరణ, వేరుచేయడం, కంపోస్ట్ తయారు చేయడం, దాన్ని అమ్మకం లాంటి వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నల్ల కనెక్షన్‌లు, ఇంకు డు గుంతలు, కిచెన్ గార్డెన్‌లు, టాయిలెట్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను, మండల వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో కంపోస్ట్ స్టాల్, స్టీల్ బ్యాంక్, శానిటరీ టూల్స్ స్టాల్, వాటర్ టెస్టింగ్, పారిశుధ్య కార్మికుల సేఫ్టీ స్టాల్, గ్రామ పంచాయతీకి వచ్చిన అవార్డులతో ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, పీపీఈ కిట్స్, హెల్త్ చెకప్స్‌ను పరిశీలించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రశం సించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ హెచ్‌యఫ్‌వో వెంకటేష్, వాష్ కన్సల్‌టెంట్ ప్రభాత్, ఇఫి కర్ కన్సల్‌టెంట్ కాశీనాథ్, కన్సల్‌టెంట్‌లు, జిల్లా యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎస్ బీఎం రమేశ్, వేణు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

- సంగీత దినోత్సవంలో ఆర్డీవో మహేశ్వర్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ కల్చరల్, జూన్ 21: కళలు అజరామరమని, కళలను, కళాకారులను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. కళాకారులకు, కళలకు చేయూతని వ్వాలని, కళలతో మానసిక, శారీరక ప్రశాంతత సాధ్యమని తెలిపారు. ప్రతీ యేటా సంగీత దినోత్సవాన్ని జరుపుతూ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అందరికీ పరిచయం చేస్తోన్న సల్వాజి ప్రవీణ్‌ను అభినందించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

సీనియర్ గాయకులు నామ్‌దేవ్, బొజ్జ రేవతి, గొల్లపల్లి రవీందర్, మురళి మధు, టి మోహనస్వామి, జి కృపాదానంతో పాటు సుమారు 10 జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయ కుల పాటలతో పాటు నంగెం రాధాకృష్ణ బృందం, చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు, రామకృష్ణ బృందం, విద్యార్థుల బ్రేక్ డాన్స్‌లు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుపత య్య, అజయ్, గుండేటి రమేశ్, అనుముల దయాకర్, అభి, బాబు గౌరవేని, సల్వాజి సంధ్య, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం పెనాల్టీ జీవోను రద్దు చేయాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కరీంనగర్ టౌన్, జూన్ 21: వానాకాలం 2021-22కు సంబంధించిన రైస్ సీఎంఆర్ నిర్ణీత కాల వ్యవధిలో ఇవ్వనందున 25శాతం పెనాల్టీ విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని కరీంనగర్ రా రైస్ మిల్లర్స్, 25 శాతం పెనాల్టీ బాధితులు రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు పలువురు బాధితులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021-22 వానాకాలం సీజన్‌లో సివిల్ సప్లయిశాఖ నుంచి ధాన్యాన్ని దించుకొని నిర్ణీత కాలవ్యవధిలో రైస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గోదాములు ఖాళీగా లేక పోవడంతో అధికారుల దృష్టికి సమస్యలను పలుమార్లు తీసుకెళ్లి విన్నవించుకున్నామని చెప్పారు. తమకు రైస్ డెలివరీ చేసేందుకు అలాట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా చాలా సార్లు కోరినప్పటికీ వివిధ కారణాలను చూపుతూ అలాట్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. 2021 సంవత్సరానికి సం బంధించిన ధాన్యం ఉత్పత్తి ఎక్కువైనందున గోదాములు పూర్తిగా నిండిపోయినప్పటికీ కూడా అధికారుల ఒత్తిడి మేరకు మిల్లు ఆవరణ లోని ఖాళీ స్థలంలో ధాన్యం బలవంతంగా దించారని మంత్రికి వివరించారు. ఆ ధాన్యాన్ని కాపాడేందుకు సరైన రక్షణ చర్యలు చేపట్టినా కూడా ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో బియ్యం తీసుకోకపో వడంతో ప్రకృతి వైపరీత్యాలతో కురిసిన భారీ వర్షాలకు ధాన్యం దెబ్బతిని నల్లరంగుగా మారి మొలకెత్తాయన్నారు. వానాకాలం ధాన్యం ఉండగానే యాసంగి ధాన్యం కూడా దిగుమతి చేశారని అన్నారు. ఇలా అనేక రకాలుగా రా రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురికావడమే కాకుండా నష్టపోయామని, సంస్థకు 100శాతం బియ్యం ఇచ్చినా కూడా పెనాల్టీ చెల్లించాలని జిల్లా అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తూ పెనాల్టీ చెల్లిస్తేనే 2024 వానాకాలం ధాన్యం అలాట్‌మెంట్ జారీ చేస్తామంటున్నారని పేర్కొన్నారు. పెనాల్టీ తో రోడ్డున పడతామని, 25 శాతం పెనాల్టీని రద్దు చేయాలని మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

- స్వాధీనం చేసుకున్న అధికారులు
- టెండర్ నిర్వహిస్తామని వెల్లడి

కోరుట్ల, జూన్ 21: మండలంలోని నాగులపేట గ్రామంలో అక్రమ నిలువలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, మామిడి తోటలతో పాటు గ్రామంలోని పలు చోట్ల ఉన్న అక్రమ ఇసుక నిలువలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 168 ఇసుక కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామం నుంచి కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ గ్రామం నుంచి భారీగా అక్రమంగా ఇసుక తరలిస్తుంటారు. ఇసుక నిలువలు ఉన్నట్లు మైనింగ్ అధికారులకు పిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారి తిరుపతి రావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రావు పోలీసుల సహాయంతో దాడులు చేశారు. త్వరలో ఇసుకను టెండర్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

తప్పుడు పత్రాలతో భూ కబ్జా

- ఐదుగురిపై కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

రాయికల్, జూన్ 21: రాయికల్ పట్టణంలో తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఐదుగురిపై కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన అనుపట్ల శ్రీనివాస్, అనుపట్ల పోచయ్యలు అన్నద మ్ములు కాగా, శ్రీనివాస్‌కు కుమారుడు ప్రశాంత్, భార్య లక్ష్మి ఉన్నారు. పోచయ్యకు సంతానం లేకపోవడంతో మేన కోడలు బూర్గుల శారదను పెంచుకున్నాడు. శ్రీనివాస్ 2010 లో రాయికల్ పట్టణంలో సర్వే నెం.1057/ఇ లో 637 చదరపు గజాల భూమిని కొనుగోలు చేశాడు. 2010, డిసెంబరు 10న అనారోగ్యంతో శ్రీనివాస్ మృతి చెందగా, అప్పటి నుంచి లక్ష్మి, తన కుమారుడు ప్రశాంత్‌తో కలిసి కొడిమ్యాల మండలం పూడూర్‌లో నివాసముం టుంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాస్ కుటుంబసభ్యులు రాయికల్‌కు రాకపోవడంతో భూ మిని సొంతం చేసుకోవాలని బూర్గుల శారద మరికొందరి సహకారంతో 2017లో జగిత్యాల మున్సిపాలిటీ నుంచి లక్ష్మి మృతి చెందినట్లు మరణ ధృవీకరణ పత్రం రాయికల్ తహసీ ల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు శ్రీనివాస్ వారసురాలిగా శారద అని తప్పుడు కు టుంబసభ్యుల ధృవీకరణ పత్రాలు సృష్టించారు. ఈ ఆధారాలతో జనవరి 5, 2024న డాక్యు మెంట్ నెం.106/2024, 107/2024 కట్కం సాయి కుమార్, అనుపట్ల పోచమ్మలకు రిజిస్ట్రేష న్ చేశారు. మారంపల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా సాక్ష్యులుగా సంతకాలు చేశారు. ఈ పత్రాలతో భూమిని కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న అనుపట్ల శ్రీనివాస్, భార్య లక్ష్మి, కుమారుడు ప్రశాంత్ తమ భూమి కబ్జాకు గురైందని ఆధారాలు సేకరించి రాయికల్ పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బూర్గుల శారద, అనుపట్ల పోచమ్మ, కట్కం సాయి కుమార్, మారంపెల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా అనే ఐదుగురు వ్యక్తులపై ఈ నెల 8న కేసు నమోదైంది. తమ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూన్ 21: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భూ తగాదాతో గంద్ర నర్సింగరావు (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సింగరావుకు తన అన్న గంద్ర సూర్యారావు, బోయినిపల్లి నర్సింగరావుకు మధ్య భూతగాదా ఏర్పడింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పరుగుల మంది తాగి అపస్మారకస్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్21: దాడి ఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింతకింది భాను, నిఖిల్, మరో యువకుడిపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని కులేరి దీప్తి కుమార్ తన ఇంటికి వెళ్తున్న దారిలో ముగ్గురు యువకులు మూత్ర విసర్జన చేశారని పేర్కొన్నారు. దారిలో మూత్ర విసర్జన చేస్తే ఎలా అని ప్రశ్నించినందుకు దీప్తి కుమార్‌పై భాను, నిఖిల్, మరో యువకుడు దాడి చేశారని చెప్పారు. అక్కడే ఉన్న బీరు సీసాతో కొట్టి చంపి వేస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు దీప్తి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నాకా బందీ

- అసాంఘిక శక్తుల కట్టడే ధ్యేయం
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లలో వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 21: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తులను కట్టడిచేసేందుకే జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, రగుడు చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలోకి వచ్చే అన్ని దారులలోనూ, మండల కేంద్రాల్లోనూ పోలీసు అధికారులు, సిబ్బంది ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు, నంబర్లు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో ఎవరైనా అనమానాస్పదంగా తిరిగితే డయల్ 100కు లేదా సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, జూన్ 21: పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌యూ రిజిస్ట్రర్‌కు శుక్రవారం వినతిపత్రం ఆందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపల్లి అంజన్న మాట్లాడుతూ పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వని కారణంగా ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. వెంటనే పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. యూజీసీ నెట్, సెట్, జేఆర్‌ఎఫ్, అర్హత సాధించిన విద్యార్థులు ఎంతోమంది నోటిఫికేషన్ లేక కూలి పనులు చేసు కుంటున్నారని దీని వెంటనే గ్రహించి నోటిఫికేషన్ వచ్చేలాగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కన్వీనర్ విష్ణు, పీజీ విద్యార్థులు మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌యూ రిజిస్ట్రర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

స్వగ్రామానికి చేరిన వలస జీవి మృతదేహం



చంద్రయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతాల చంద్రయ్య(55) మాల్దీవుల దేశంలో ఈ నెల 17న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన మృతదేహం శుక్రవారం ఇల్లు చేరింది. కుటుంబ పెద్ద విగత జీవిగా శవ పేటికలో చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోధించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవుల దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవుల దేశానికి వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడు. నాలుగు రోజులకు చంద్రయ్య మృతదేహం ఇల్లు చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు అన్నదమ్ములు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీలు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



సీవీ శ్రీనివాస్(ఫైల్)

అంతర్గాం, జూన్ 21: రామగుండం పట్టణంలోని రైల్వేకాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి సీవీ శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీవీ శ్రీనివాస్ 30ఏళ్లుగా రామగుండం రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపోలో పని చేస్తున్నాడు. పిల్లల ఉన్నత చదువుల కోసం అప్పులు చేసిన శ్రీనివాస్ ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీవీ శ్రీనివాస్ గతంలో వివిధ పత్రికలకు కథనాలను కూడా రాశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన పలువురు పాత్రికేయులు మృతదేహానికి నివాళులర్పించారు. సీవీ శ్రీనివాస్‌కు భార్య అరుణ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన రామగుండం ఎస్‌ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అప్పగింత



తోట లక్ష్మికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 21: గోదావరిఖని బస్‌లో ఈనెల 19న బంగారు ఆభరణాలు మరిచిపోయిన ప్రయాణికురాలు తోట లక్ష్మికి రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలను శుక్రవారం ఆర్‌టీసీ డీఎం నాగభూషణం డిపోలో అప్పగించారు. గోదావరిఖని డిపోకు చెందిన టీజీ22జెడ్ 0013 ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా సుల్తానాబాద్ వద్ద బస్సులో ఒక చేతి సంచిని గమనించిన కండక్టర్ శ్రీనివాస్ అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించి డిపోకు వచ్చిన తరువాత అధికారులకు అప్పటించారు. రూ.7లక్షల విలువ చేసే 89గ్రాముల బంగారాన్ని ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన తోట లక్ష్మి అనే ప్రయాణికురాలివి గుర్తించారు. తగిన ఆధారాలతో డిపో అధికారులను సంప్రదించగా తిరిగి ఆ బంగారు ఆభరణాలు తోట లక్ష్మికి డీఎం నాగభూషణం అప్పగించారు. నిజాయితీగా ఆభరణాలు అప్పగించిన కండక్టర్ శ్రీనివాస్‌ను లక్ష్మి కుటుంబ సభ్యులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సదానందం, సెక్యూరిటీ సిబ్బంది సత్యనారాయణ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

ముస్తాబాద్, జూన్ 21: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన కంచర్ల దేవయ్యగౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవయ్యగౌడ్ కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీన వృత్తిలో భాగంగానే తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు తెగిపోవడంతో కింద పడి తీవ్రగాయాలకు గురయ్యారు. గమనించిన కార్మికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాలుగు నెలల తరువాత మృతి చెందాడు.

బావిలో పడి కూలీ మృతి

ధర్మపురి, జూన్ 21: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శివరాత్రి మహేష్(25) అనే కూలీ వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో జక్కుల రాజన్న అనే వ్యక్తి వ్యవసాయ బావి చుట్టూ తెట్టె కట్టే కూలి పనికి మహేస్ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి శివరాత్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల బీభత్సం

తంగళ్లపల్లి, జూన్ 21: దేశాయపల్లె మల్లాపూ ర్‌లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. మల్లాపూర్‌లో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న బాస ఎల్లవ్వ మెడలో మూ డు తులాల పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేష్‌కు చెందిన రెండు సెల్ ఫోన్లు దొంగి లించారు. దేశాయిపల్లెకి చెందిన పర్శరాములు ఇంటి తాళం పగలగొట్టి రూ.4 వేల ఎత్తుకెళ్లారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలాలను పరిశీలించారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 22మంది రైతులు 338క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కోటేశ్వర స్వామికి మాజీ మంత్రి కొప్పుల పూజలు



కోటిలింగాలలో పర్యటిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, జూన్ 21: ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి అర్చన, అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం అర్చకులు కొప్పులకు స్వామి వారి శేష వస్త్రం కప్పి ఆశీర్వచనాలు, స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, మూగల సత్యం, సనీల్, వెంకటేష్, హరీష్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో వివాదం

కథలాపూర్, జూన్ 21 : మండల కేంద్రంలోని 163 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో వివాదం చెలరేగింది. గతంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు తమకు ప్రభుత్వం భూమి కేటాయించిందని షెడ్ నిర్మించుకున్నారు. దీంతో ఆ భూమి వారికి చెందినది కాదని గ్రామస్థులు షెడ్‌ను కూల్చివేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి వాడుకుంటామని పేర్కొంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నారు. తమకే భూమి చెందుతుందని మున్నూరు కాపు సంఘ సభ్యులు ఈ మధ్య చదును చేసుకున్నారు. శుక్రవారం గ్రామస్థులు అక్కడ పౌర్ణమి సందర్భంగా జరిగే జాతర నిమిత్తం భక్తులకు అన్నదానం చేస్తామని టెంట్లు వేసే క్రమంలో వివాదం రాజుకుంది. ఈ విషయం తెలుసుకున్న కోరుట్ల సీఐ సురేశ్‌బాబు సంఘటనా స్థలంకు చేరుకుని ఆ భూమి విషయంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించవద్దని నచ్చజెప్పారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఎండీ



కథలాపూర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ

కథలాపూర్, జూన్ 21 : మండల కేంద్రంలోని 130/22 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో ఎంత మేర లోడ్ ఉంటోందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 220/33 విద్యుత్ సబ్‌స్టేషన్ కొత్తగా మంజూరైన నేపథ్యంలో వినియోగదారుల అవసరాలు తీరే అవకాశాలు ఎలా ఉన్నాయని సమాచారం సేకరించారు. అదేవిధంగా అంబారిపేట దాకా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సత్యనారాయణ, డీఈఈ తిరుపతి, ఏఈ జమీల్‌పాషా ఉన్నారు.

సివిల్స్ లాంగ్‌టర్మ్‌కు ఉచిత శిక్షణ

జగిత్యాల అర్బన్, జూన్ 21: జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ కోసం లాంగ్ టర్మ్ శిక్షణ అందిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి సాయాబాబా తెలిపారు. ఈ నెల 21 నుంచి జూలై 3వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 18 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని, ఈ శిక్షణలో మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనుండగా, అందులో 100 మందికి వచ్చేనెల 7వ తేదీన ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఎంపిక జరుగుతుందని, మిగతా 50 మంది విద్యార్థులను ఇంతకు ముందు యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా తీసుకుంటామన్నారు. వారు సంబంధిత ధృవపత్రాలతో వచ్చే నెల 3వ తేదీలోగా టీజీబీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్ హైదారాబాద్ నందు దరఖాస్తులను సమర్పించాలన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు వసతితో పాటు భోజన సదుపాయం, రవాణా ప్రయోజనం కోసం రూ.5000, బుక్‌ఫండ్ నిమిత్తం రూ5000 ఒకసారి అందించబడుతుందన్నారు. ఈ ఉచిత శిక్షణ హైద్రాబాద్‌లో ఉంటుందని, కావున అభ్యర్థులందరూ సంబంధిత ధృవపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'ప్రైవేట్ పాఠశాలల దోపిడిని అరికట్టాలి'

మెట్‌పల్లి, జూన్, 21 : మెట్‌పల్లి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమించి చేస్తున్న దోపిడిని అరికట్టాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పలు రకాల కోచింగ్‌ల పేరుతో అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణ చేశారు. కండిషన్ లేని బస్సులను ఏర్పాటు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూళ్లు, బుక్స్ యూనిఫాంల పేరిట దోచుకుంటురని మండల, జిల్లా విద్యాధికారులకు సమస్యలు తెలిపి వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోకపోవడం సిగ్గుచేటాన్నరు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందించాల్సిన యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతపత్రం అందజేయడం జరిగిందన్నారు. వినతి పత్రం అంజేసిన వారిలో నాయకులు దోనికేల నవీన్, నుంకేట విజయ్, కలిగోట శ్రీకాంత్, నూనె క్రాంతికిరణ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం

ఓల్డ్ హై స్కూల్ హెచ్ఎం రామానుజన్

జగిత్యాల అర్బన్, జూన్ 21: ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు దాతలు ముందుకువచ్చి తమ వంతు చేయూతను అందించడం అభినందనీయమని ఓల్డ్ హై స్కూల్ హెచ్ఎం రామానుజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివే సుమారు 250 మంది విద్యార్థులకు పట్టణానికి చెందిన కస్తూరి రాకేష్-పుష్పలత దంపతులు రూ.12వేల నోట్‌బుక్‌లు, పెన్నులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామానుజన్‌తో పాటు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, అందులో చదివే విద్యార్థులకు తోడ్పాటును అందించేందుకు దాతలు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. విద్య ప్రోత్సాహానికి దాతలు మరింతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ సంఘ బాధ్యులు బోనగిరి దేవయ్యతో పాటు ఉపాధ్యాయులు, దాతల కుటుంబీకులు, మిత్రులు పాల్గొన్నారు.

భక్తురాలికి ఫోన్ అప్పగించిన ఆలయ ఈవో

ధర్మపురి, జూన్ 21: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఒక భక్తురాలు సెల్ ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ద్వారా శుక్రవారం ఆమెకు అప్పగించారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన గంజికుంట్ల లక్ష్మి స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన సెల్ ఫోన్ పోగొట్టుకుంది. ఫోన్ సిబ్బందికి దొరకడం వల్ల విచారణ జరిపి ఆలయ ఈవో భక్తురాలికి అప్పగించారు. భక్తురాలు ఆలయ సిబ్బందితో పాటు ఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ధర్మపురి, జూన్ 21: యోగా సాధన ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా శిక్షకులు పెద్ది శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా పట్ల అవగాహన కల్పించి, అమృతాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, రేణికుంట రమేష్, సంగి మంజుల పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీ వాణి విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించగా ప్రముఖ సంగీత విద్వాంసులు కొరిడె నరహరి, ఆలయ డోలు విద్వాంసులు తంబత్క సురేష్, యోగా సాధకులు గొల్లపల్లి సుమలత సంగీతం, యోగా ప్రాధాన్యత గురించి తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోషి, డైరెక్టర్ దినేష్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దొంతాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల హెచ్ఎం రాజేశం, ఉపాధ్యాయులు సునీత, అనిత పాల్గొన్నారు.

మెట్‌పల్లి: యోగా అనేది నిరంతరం ప్రక్రియ, ప్రతి రోజు ఆసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో న్యాయవాదులు, మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ల్లో సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలతో పాటు సిబ్బందితో యోగా గురువులు ఆసనాలు వేయించారు. అనంతరం యోగా గురువులు ఎనగందుల హన్మండ్లు, రాజారత్నాకర్‌లను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింబాద్రి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జగన్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: విద్యార్థుల మానసిక వికాసానికి యోగా అత్యంత అవసరమని రాయికల్ పట్టణ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశం, రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, గుండేటి తరంగిణి, ఏనుగు రజిత, ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే ప్రగతి ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బీజేపీ జగిత్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి నివాసంలో యోగా వేడుకలు నిర్వహించారు.

●మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగా ఆకారంలో కూర్చుని అబ్బురపరిచారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు యోగా ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ప్రత్యేకాధికారి శోభారాణి పాల్గొన్నారు.

పెగడపల్లి : యోగాతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరు నిత్య జీవితంలో యోగా చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలలతో పాటు యువకులు శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత నెలకొనడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఎన్ని పనులు ఉన్నా నిత్యం ఒక గంట యోగాకు కేటాయించి ఆరోగ్యవంతులుగా ఉండాలని పలువురు యోగా గురువులు పేర్కొన్నారు.

కోరుట్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పట్టణంలోని పలు పాఠశాలు, వివిధ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లిటిల్ జీనియస్, సరస్వతి శిశుమందిర్, గౌతమ్ మాడల్ స్కూలతో పాటు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలు, యువజన సంఘాలు, అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా విన్యాసాలను నిర్వహించి వేడుకలను జరిపారు. పట్టణంలో రైల్వే స్టేషన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ప్రాంతంలో యోగా నిర్వహించి వేడుకలను జరిపారు. పలు పాఠశాలలో విద్యార్థులు యోగాలో పాల్గొన్ని విన్యాసాలను చేశారు. పలు పాఠశాలల నిర్వహకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయలు యోగలో విద్యార్థులకు విన్యాసాలను నిర్వహించి వేడుకలను నిర్వహించారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసీయషన్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలువురు స్వయం సేవకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. మండలంలోని పూడూర్‌లో ఎస్.ఎస్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగా గురువు బాస్కరాచార్యులు యోగా ప్రాధాన్యతను వివరించారు. పూడూర్ మాజీ ఉప సర్పంచు లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు అజయ్‌రెడ్డి, గ్రామ ప్రముఖులు కమలాకర్ పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో యోగా డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. యోగా వల్ల చేకూరు ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రతీ దినం విధిగా యోగా చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు యోగ చేయించారు.

వెల్గటూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా మాస్టర్ రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ శాఖ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో యోగా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు వెంకటగిరి, మల్లారెడ్డి, తిరుపతి, భూమేష్, అంజి, మహేష్ పాల్గొన్నారు.

మల్యాల: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలలు వివిధ సంస్థల్లో నిర్వహించారు. మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్, వైద్యురాలు మౌనిక యోగతో పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవచ్చు నని అన్నారు. మానసిక ప్రశాంతతకు యోగను అలవర్చుకోవాలని సూచించారు. మండలంలోని రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా గురించి వివరించారు. విద్యార్థులతో యోగాసనలు చేయించారు. ఉపాధ్యాయులతో పాటు బీజేపీ నాయకులు సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: ప్రతి నిత్యం యోగా ఆసనాలు వేయడంతో శారీరక, మానసిక సమస్యలు దూరమవుతాయని బీజేపీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, పెద్దాపూర్ గురుకులం ప్రిన్సిపల్ విద్యసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గసాగర్, పెద్దాపూర్‌లోని గురుకులం పాఠశాలలోని విద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పారు. నాయకులు గంగాధర్, శ్రీనివాస్, ముత్తన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్మపురిలో యోగా ఆసనాలు



కోరుట్ల సరస్వతి శిశు మందిర్‌లో యోగ చేస్తున్న విద్యార్థులు



రాయికల్ ప్రగతి ఉన్నత పాఠశాలలో..



పెగడపల్లి కేజీబీవీ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు



మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆసనాలు వేస్తున్న సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి



మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో..

అభివృద్ధిలో మెట్‌పల్లి ముందంజలో ఉంది

మున్సిపల్ చైర్‌పర్సన్ రానవేణి సుజాత

మెట్‌పల్లి, జూన్, 21 : అభివృద్ధిలో మెట్‌పల్లి పట్టణం ముందుంజలో ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ రానావేణి సుజాత అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి పురపాలక కార్యాలయంలో చైర్ పర్సన్ రానావేణి సుజాత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిరవ్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలు చదివి వినిపించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సభ దృష్టికి పలువురు కౌన్సిలర్లు సూచించారు. స్పందించిన చైర్మన్ అధికారులు సమస్యలు తెలిపిన వాటిని నోటు చేసుకోని కౌన్సిర్లు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వార్డుల్లో పారి శుధ్య పనులపై నిర్లక్ష్యం విడనాడలని, సమస్యలపై కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రవేశపెట్టిన 30 అంశాలకు సంబంధించి చర్చించినంతరం కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో గతములో కంటే చాల అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. వానాకాలంలో పట్టణంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మురికి కాలువ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి పట్టణంలోని ప్రధాన మురికి కాలువను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఫ్లెక్సీతో పట్టుకోని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ మోహన్‌కు వినతి ప్రతం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ పట్టణంలోని కూరగాయాల మార్కెట్ సమీపంలోని ప్రధాన మురికి కాలువను నాయకుడు కబ్జా చేశారాన్నారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో అక్కడ వర్షపు నీరు రోడ్లపై నిలిచి వాహనదారులు, వ్యాపారస్థులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మురికి కాలువను కబ్జా చేసిన నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. నిరసన తెలిపిన వారిలో కౌన్సిలర్లు మర్రి పోచయ్య, యామ రాజయ్య, మర్రి సహదేశ్, చెర్లపల్లి మీనా-సుఖేందర్‌గౌడ్, జుంగోని మానస, జక్కని సుజాత, పిప్పెర లలిత-రాజేష్, కోఆప్షన్ సభ్యులు మార్గం గంగాధర్, మాధవరెడ్డి, నాయకులు ఉన్నారు.



మెట్‌పల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ రానావేణి సుజాత

సాయి బాబా ఆలయంలో చండీ హవనం

జగిత్యాల టౌన్, జూన్ 21 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో 25 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక కళ్యాణార్థం వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో చండి హవనం నిర్వహించారు. అనంతరం భక్తులు సాయి బాబాకు అభి షేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, ఎలగందుల సత్యనారాయణ, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, గుండేటి రాజు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

జగిత్యాల టౌన్, జూన్ 21 :నెషనల్ హెల్త్ మిషన్ కింద వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. జీవో 510లో తమను చేర్చకపోవడంతో పనికి తగిన వేతనాలు పొందక ఆర్థికంగా నష్టపోతున్నామని కోరతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి ఉద్యోగ భద్రతతో కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకవెళతానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎహెచ్ఎం ఉద్యోగులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్

మెట్‌పల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి

మెట్‌పల్లి, జూన్, 21 : తెలంగాణ సిద్ధాంత కర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా రాష్ట్ర ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలచిపోయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని మెట్‌పల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి అన్నారు. శుక్ర వారం పట్టణంలోని స్వర్ణకార సంఘ భవనంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి సభ్యులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. మనయ సంఘ భవనంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్య సభ్యులతో కలిసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతరం కృషి వల్లే తెలంగాణ ఏర్పాడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ మార్కెట్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీధర్, కార్యదర్శి దురిశెట్టి నటరాజ్, ఇందూరి గిరిధర్, సంజీవ్, సతీష్, హన్మండ్లు, కృష్ణమాచారి, మహేష్, నరహరి, శ్రీనివాస్, వంశీ, నరేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు బెజ్జంకి నితిన్, ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, కామెర శాంతి, కవిత పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని స్వర్ణకార భవనంలో నివాళులర్పిస్తున్న స్వర్ణకారులు

సంక్షిప్త సమాచారం

మల్యాల, జూన్ 21: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి గురువారం రాత్రి మృతి చెందగా మండలం నుంచి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రూపాదేవి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మండల నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, రాంలింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శోభారాణి, లక్ష్మారెడ్డి, శంకర్, సతీష్‌రెడ్డి ఉన్నారు.

కొడిమ్యాల : చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం సతీమణి గురువారం రాత్రి ఆకాల మరణం చెందటంతో అంత్యక్రియలకు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాదుకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే సతీమణి మరణ వారంత తెలియగానే మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మనస్థాపానికి గురయ్యారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం శ్రీ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు బుక్కులు పంపిణీ చేశారు. పాఠశాలలోని ప్రతి ఒక్క విద్యార్థికి ఆరు నోటు బుక్కులను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు ఓగుల అజయ్, రాకేష్, ము జాయిద్, సిరిపురం నవీన్, చరణ్, ఉపాధ్యాయులు రజిత, తేజస్విని, స్వరూప పాల్గొన్నారు.

కొడిమ్యాల : బీజేపీ కొడిమ్యాల మండల కార్యదర్శిగా మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన పొనగంటి రమణాచారిని శుక్రవారం నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకురాలు ముత్యపు రాధిక ఇంటిలో శుక్రవారం ఘనంగా వట సావిత్రి వ్రతాలు ఆచరించారు. ప్రతి సంవత్సరం జేష్ట మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ వ్రతాలు ఆచరిస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకురాలు ముత్యపు రాధిక, ముత్యపు పద్మ, మురికి భాగ్యలక్ష్మి, రేణికుంట ఉర్మిల పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన నేతలు

జగిత్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును శుక్రవారం జగిత్యాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైద్రాబాద్‌లోని తన నివాసంలో జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాది, టీపీసీసీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్‌తో పాటు పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

కొడిమ్యాల, జూన్ 21 : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాలిసిన మండల సర్వ సభ్య సమావేశం వాయిదా వేసినట్లు మండల పరిషత్ అధికారులు ప్రకటించారు. చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం సతీమణి ఆకాల మరణం చెంది నందున ఎంపీపీ ఆదేశాలతో వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

భీమారం, జూన్ 21: భీమారం మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.